సాక్షి
ఆదిలాబాద్

సోమవారం | 28 | జూలై | 2025



రేపటి వరకే చాన్స్

కాగజ్‌నగర్ 'నవోదయ'లో 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు మంగళవారంతో గడువు ముగియనుంది. ఇప్పటివరకు 2,660 దరఖాస్తులు వచ్చాయి. 8లో▸



విచ్చలవిడిగా గడ్డిమందు

రెండేళ్లుగా గడ్డి మందు వినియోగం పెరిగింది. కలుపుతీతకు రైతులు ఎక్కువగా వినియోగిస్తుండడంతో భూసారంపై ప్రభావం చూపుతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్పీ అఖిల్

సాత్నాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. భోరజ్ మండలంలోని కొరటా, గిమ్మ, తర్ణం గ్రామాల్లో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హాజరయ్యారు. ముందుగా చనాఖా–కొరటా ప్రాజెక్టును సందర్శించారు. పెన్‌గంగ బ్రిడ్జి వద్ద నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆయా గ్రామాల యువతకు వాలీబాల్ కిట్స్ అందజేశారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై గౌతమ్, మూడు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన వాయిదా

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్ జిల్లా పర్యటన వాయిదా పడింది. సోమవారం ఆయన ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో పర్యటించాల్సి ఉంది. అయితే రాష్ట్ర కేబినేట్ సమావేశం నేపథ్యంలో మంత్రి జిల్లా పర్యటన వాయిదా పడినట్లుగా అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ఆయన జిల్లా పర్యటనకు రానున్నట్లుగా తెలిపారు.

30న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్‌లో ఉద్యోగాల కల్పన కోసం ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. పలు ప్రైవేట్ కంపెనీల్లో సర్వీస్, అడ్వైజర్ ఉద్యోగాల కోసం జిల్లా ఉపాధికల్పన శాఖ కార్యాలయంలో నిర్వహించనున్న మేళాకు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి రూ. 12వేల వరకు వేతనం అందించనున్నట్లు తెలి పారు. ఆసక్తి గల యువకులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9133307724, 94943 05417 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకాధికారికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ భవన్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. అలాగే పదోన్నతి కల్పించాలని, సీనియారిటీ జాబితా రూపొందించాలని పేర్కొన్నారు. ఇతర సమస్యలను విన్నవించగా, ప్రత్యేక అధికారి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇందులో సంఘం అధ్యక్షుడు పాచ్చన్న, ప్రధాన కార్యదర్శి అరవింద్, కార్యవర్గ సభ్యులు లత, మహేందర్, వెంకటగిరి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన వారితో కోచ్ సాయి

ఆదిలాబాద్: హైదరాబాద్‌లోని షేక్‌పేటలో నిర్వహించిన నాలుగో సబ్‌జూనియర్‌రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. 40–43కిలోల విభాగంలో జే.నిత్యారెడ్డి స్వర్ణ పతకం, 35–37కిలోల విభాగంలో నందిని రజతం, 52–55 కిలోల విభాగంలో బీ.నిఖిల్ రజతం, 43–46 కిలోల విభాగంలో సి.వివేక్, 43–46 కిలోల విభాగంలో బత్తుల అశ్వినీ కాంస్య పతకాలతో మెరిశారు. ఇందులో నిత్యారెడ్డి ఆగస్టు 6 నుంచి 13వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో నిర్వహించనున్న జాతీయ సబ్‌జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సాయి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయేందర్, ఎంఏ బేగ్ తదితరులు అభినందించారు.

డుమ్మా వైద్యులకు చెక్

- సమయపాలన తప్పనిసరి
- ఆస్పత్రుల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్
- వివరాలు సేకరించిన వైద్యశాఖ
- ఆగస్టు 1నుంచి అమలుకు చర్యలు
- రోగులకు ఇక నాణ్యమైన వైద్యసేవలు



జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం

జిల్లాలో..
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 22
పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 5
బస్తీ దవాఖానాలు : 2
ఏరియా ఆస్పత్రులు : 2
సబ్‌సెంటర్లు : 126
వీటి పరిధిలో పోస్టులు : 463
పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది : 315
ఖాళీ పోస్టులు : 148

ఆదిలాబాద్‌టౌన్: డుమ్మా వైద్యులపై ప్రభుత్వం దృష్టి సారించింది. వారికి చెక్ పెట్టేలా చర్యలకు సిద్ధమైంది. జిల్లాలో చాలా మంది వైద్యులు సమయపాలన పాటించకపోవడం, ఇష్టానుసారంగా విధులు నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం వైద్యులు, సిబ్బందికి ఆధార్ బేస్డ్ అటెండెన్స్ అమలుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఆయా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, సబ్ సెంటర్లలో పనిచేసే వైద్యులు, సిబ్బంది వివరాలను ఆ శాఖ అధికారులు సేకరించారు. ఆధార్‌నంబర్‌తో పాటు సెల్‌నంబర్, ఇతర వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ప్రక్రియపై ఈనెల 28, 29 తేదీల్లో ఉద్యోగులకు శిక్షణ సైతం ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1 నుంచి అమలులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, ఏరియా ఆస్పత్రులు, సబ్ సెంటర్లలో చాలా మంది వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు తనిఖీ చేసిన సమయంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడాన్ని ప్రభుత్వం గమనించింది. జిల్లాలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఆయా పీహెచ్‌సీలకు వచ్చినప్పుడు వైద్యులు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు సేవల కోసం వస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలు సైతం పోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్సులు, కింది స్థాయి సిబ్బందితోనే నామమాత్రంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇలాంటి వాటికి ఆధార్ బేస్డ్ అటెండెన్స్ చెక్ పెట్టనుంది. కోవిడ్‌కు ముందు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో బయోమెట్రిక్ హాజరు అమలులో ఉండేది. వివిధ కారణాలతో అవి మూలనపడ్డాయి. విధానం అమలులో ఉన్నప్పటికీ చాలా మంది తప్పించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు కొందరు ప్రైవేట్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తూ మధ్యాహ్నమే ఇంటి ముఖం పడుతున్నారు. ఈ ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌తో వీరి ఆగడాలు బయటపడనున్నాయి. సెల్‌ఫోన్లలో ఫేషియల్ అటెండెన్స్ యాప్ ద్వారా హాజరు వేయాల్సి ఉంటుంది. పీహెచ్‌సీకి 50 మీటర్ల దూరం నుంచి ఈ యాప్ పనిచేస్తుంది. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారితో పాటు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులకు ఈ యాప్ అనుసంధానం ఉంటుంది. ఎప్పటికప్పుడు వివరాలు వారికి అందుతాయి. హాజరు వేసిన వైద్యుల లొకేషన్ షేర్ అవుతుంది. ఏ సమయానికి వచ్చారు.. ఏ సమయానికి వెళ్తున్నారు.. నెలలో ఎన్నిసార్లు రావడం లేదనే విషయాలు తెలుస్తాయి. వీటి ఆధారంగానే వేతనాలు చెల్లిస్తారని వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం సక్రమంగా అమలైతే రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందే అవకాశం ఉంటుంది. అలాగే సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటారని తెలుస్తోంది.

ముహూర్తం ఖరారు..

జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో ఆధార్ ఆధారిత హాజరు విధానం అమల్లోకి తీసుకొచ్చేందుకు ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1 నుంచి అమలు చేయాలని వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్‌వో పరిధిలోని ఆస్పత్రులతో పాటు ఆయూష్, రిమ్స్‌లోనూ అమలు కానుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ టెక్నాలజీ సర్వీస్ అభివృద్ధి చేసిన మొబైల్ ఫేషియల్ అథెంటిక్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ఈ విధానం అమలు చేస్తుండగా, అక్కడ విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది.

వివరాలు సేకరించాం..

ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌కు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, మినిస్టీరియల్ స్టాఫ్‌కు సంబంధించిన వివరాలను సేకరించాం. ఈ విధానం అమలైతే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తారు. ఎవరు ఏ సమయానికి వచ్చారు, ఎప్పుడు వెళ్తారనే విషయాలు తెలిసిపోతాయి. నిబంధనలు పాటించని వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

'స్థానిక'.. సన్నద్ధం

- ఆదిలాబాద్ ఎన్నికలకు గుజరాత్ బ్యాలెట్ బాక్స్‌లు
- అదనంగా 1030 తెప్పించుకోవాలని సర్కారు ఆదేశం
- రిజర్వేషన్ల ఉత్కంఠకు నేడు తెరపడే అవకాశం



మావల గ్రామ ముఖచిత్రం

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.పంచాయతీ, పరిషత్ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించాలని భావిస్తోంది. సెప్టెంబర్ నెలాఖరులోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే రాష్ట్ర హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, సిబ్బందిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే యంత్రాంగాన్ని ఆదేశించిన ప్రభుత్వం తాజాగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లపై దృష్టి సారించడం అందుకు బలాన్ని చేకూరుస్తోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉండగా అదనపు బాక్స్‌లను ఇతర రాష్ట్రాల నుంచి సమకూర్చుకోవాలని ఆదేశించడంతో ఈ రెండు ఎన్నికలు ఏకకాలంలో ఉంటాయనే సంకేతాలు వినిపిస్తున్నాయి. మరోవైపు రిజర్వేషన్లపై సోమవారం నిర్వహించనున్న రాష్ట్ర కేబినేట్‌లో స్పష్టత వచ్చే అవకాశముందని తెలుస్తోంది.ఈ భేటీ తర్వాత ఎప్పుడైనా స్థానిక పోరుకు నోటిఫికేషన్ వెలువడవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏకకాలంలో స్థానిక పోరు ..

జిల్లాలోని 473 గ్రామపంచాయతీలు, 3,870 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం 2,400 బ్యాలెట్ బ్యాక్స్‌లను సిద్ధం చేశారు. పంచాయతీ ఎన్నికలకు ఉదయం పోలింగ్, మధ్యాహ్నం కౌంటింగ్ ఉండే అవకాశముండటంతో ఈబాక్స్‌లు ఎన్నికలకు పూర్తిస్థాయిలోసరిపోనున్నాయి. అదే పరిషత్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగిన వారం, 15 రోజుల తర్వాత ఫలితాలు వెల్లడించే అవకాశముంటుంది. అప్పటి వరకు బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రాల్లో భద్రపర్చాలి. దీంతో సరిపడా బాక్స్‌లను సమకూర్చుకోవాలని ప్రభుత్వం జిల్లా పంచాయతీ, జెడ్పీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రెండు ఎన్నికలను కొన్ని రోజుల వ్యవధిలో నిర్వహించవచ్చనే అభిప్రాయాన్ని ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

గుజరాత్ బ్యాలెట్ బాక్స్‌లు ..

పంచాయతీ, పరిషత్ ఎన్నికలను రోజుల వ్యవధిలో ఏకకాలంలో నిర్వహిస్తే బ్యాలెట్ బాక్స్‌ల కొరత ఏర్పడే అవకాశముందని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు పూర్తిస్థాయిలో సమకూర్చుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మరో 1030 బాక్స్‌లను గుజరాత్ నుంచి తెప్పించుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ చర్యలు పరిశీలిస్తే ఈ రెండు ఎన్నికలను హైకోర్టు ఆదేశాలకనుగుణంగా గడువులోపు పూర్తిచేయాలని భావిస్తున్నట్లుగాతెలుస్తోంది. మరోవైపు జిల్లాలోని సీనియర్ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కూడిన ప్రత్యేక బృందాలను ఆ రాష్ట్రానికి పంపించే దిశగా కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ అనుమతి మేరకు రెండు, మూడు రోజుల్లోనే వారు గుజరాత్‌లో పర్యటించి అక్కడి నుంచి బాక్స్‌లను జిల్లాకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల నిర్వహణపై నేడు స్పష్టత

స్థానిక ఎన్నికలను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. రెండు నెలల గడువు మాత్ర మే ఉండటంతో ఆలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. సోమవారం సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే కేబినేట్ మీటింగ్‌లో దీనిపై స్పష్టత రానుందనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌కు ఇంకా గవర్నర్ ఆమోదం తెలుపలేదు. ఈ నేపథ్యంలో ఏ ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేస్తారనే ప్రశ్నలు సైతం తలెత్తుతున్నాయి. అయితే నేటి కేబినెట్ భేటి అనంతరం దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. అలాగే ఆశావహుల్లోనూ ప్రతిష్టంభన తొలగిపోనుంది.

కలెక్టర్‌కు ఫైలు పంపించాం

ఎన్నికల నిర్వహణకు వీలుగా జిల్లాకు అదనంగా బ్యాలెట్ బాక్స్‌లను తెప్పించుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఇందుకోసం కలెక్టర్‌కు తగు వివరాలతో కూడిన ఫైల్‌ను పంపించాం. వారి అనుమతి మేరకు ప్రత్యేక బృందాన్ని గుజరాత్‌కు పంపించి బ్యాలెట్ బాక్స్‌లను తెప్పిస్తాం. ప్రభుత్వ, ఈసీ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించేలా తగు చర్యలు తీసుకుంటాం.

– జి.రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్
- బోథ్, గుడిహత్నూర్ మండలాల్లో పర్యటన



బోథ్ ఆసుపత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి హరికిరణ్

బోథ్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ అన్నారు. జిల్లాలోని బోథ్, గుడిహత్నూర్ మండలాల్లో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా బోథ్ సీహెచ్‌సీని సందర్శించారు. వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. బోథ్ మండలం కన్గుట్ట గ్రామానికి చెందిన మహేశ్ కుమార్తె మూడేళ్ల చిన్నారి సాయి అన్విని చూసి చలించిపోయారు. ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, ప్రత్యేక వైద్యం అందించాల్సిందిగా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. వెంటనే ఆమెను 108లో రిమ్స్‌కు తరలించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, మందుల నిల్వపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకముందు బోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రం, గోదాంను పరిశీలించారు. యూరియా స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూరియా మహారాష్ట్రకు తరలిపోకుండా ఘన్‌పూర్ అబ్కారీ చెక్‌పోస్ట్ వద్ద ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. వారి వెంట ట్రెయినీ కలెక్టర్ సలోని ఛాబ్రా,డీసీవో మోహన్, డీఏవో శ్రీధర్‌స్వామి, వైద్యసిబ్బంది, తదితరులున్నారు.

సేవల్లో పారదర్శకత లక్ష్యం..

గుడిహత్నూర్: రైతులకు అందించే సేవల్లో పారదర్శకత లక్ష్యమని హరికిరణ్ అన్నారు. స్థానిక పీఏసీ ఎస్‌ను సందర్శించి మాట్లాడారు. ఈ పాస్ మిషన్ల ద్వారా అర్హులైన రైతులకు ఎరువులు, ఇతర సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. అనంతరం ఎరువుల గోదాంలను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ కవితారెడ్డి, ఎంఏవో రమేశ్ భగత్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్, సీఈవో పండరీ ఉన్నారు.

రిమ్స్‌లో కోలుకున్న చిన్నారి..

ఆదిలాబాద్‌టౌన్: చిన్నారి సాయి అన్వి రిమ్స్‌లో చేర్పించాక ఆరోగ్యం కొంత మెరుగుపడిందని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం బ్రెయిన్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా తమ చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ప్రత్యేక అధికారి, కలెక్టర్, వైద్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా 'సర్వేయర్', జీపీవో రాత పరీక్షలు



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్, గ్రామ పాలనాధికారి పోస్టుల నియామకాల కోసం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 29 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 155 మందికి గాను 129 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యా రు. ఉదయం 9.30 నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం నిర్వహించిన టిప్పన్ ప్లాటింగ్ పరీక్షలో 40మార్కులకు సంబంధించిన ప్రశ్న మరాఠీ మీడియంలో ఉండటంతో తెలుగులో తర్జుమా చేసేందుకు అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ప్రశ్న ముద్రణ సైతం సరిగా లేక అయోమయానికి గురయ్యారు. అలాగే జీపీవో నియామక పరీక్షను మావల మండల కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన పరీక్షకు 51 మంది హాజరుకావాల్సి ఉండగా 48 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సందర్శించారు. నిర్వహణ తీరును పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో స్రవంతి, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్, పరీక్షల పరిశీలకులు కె.రాజలింగు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణార్థులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు రాజేందర్ తెలిపారు. శిక్షణకు హాజరైన 155 మందిని రెండు బృందాలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలి రోజున 80 మంది, 29న మిగతా వారికి ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా కేంద్రంలోని ఏరోడ్రమ్ మైదానంలో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

సర్కారు బడిలో ప్రీప్రైమరీ

- ఎల్‌కేజీ, యూకేజీ అందుబాటులోకి
- జిల్లాలో 15 పాఠశాలలు ఎంపిక
- పీఎంశ్రీ కింద ఇప్పటికే నాలుగు బడుల్లో అమలు

జిల్లాలో డీఈవో పరిధిలో పాఠశాలలు..
ప్రాథమిక : 500
ప్రాథమికోన్నత : 119
ఉన్నత : 120
మొత్తం విద్యార్థులు : 65వేల మంది



బొమ్మల సాయంతో చదవుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతోంది.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో ఇంగ్లీష్ మీడియం చదివించేందుకు నాలుగేళ్లకంటే ముందే చేర్పిస్తున్నారు. విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదివిన పిల్లలు అక్కడే పైతరగతులు చదవడంతో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రీప్రైమరీ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కొన్నేళ్లుగా విన్నవిస్తున్నారు. జిల్లాలో ఇదివరకే పీఎంశ్రీ పథకం కింద నాలుగు ప్రీప్రైమరీ స్కూళ్లు ప్రస్తుతం కొనసాగుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 15 పాఠశాలలను ఎంపిక చేసింది. త్వరలో తరగతులను ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతుండగా.. నిరుద్యోగులకు సైతం ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

ప్రీప్రైమరీ విద్యాబోధన కోసం జిల్లాలో 15 పాఠశాలలనూ ఎంపిక చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో కేశవపట్నం ప్రాథమిక పాఠశాల, దుబ్బ(కె), కంఠ, దస్నాపూర్‌గూడ, వైజాపూర్, కేస్లాగూడ, బరంపూర్, రాంపూర్(పి), మల్కాపూర్, చెర్లపల్లి, గుబిడి, యాపల్‌గూడ, రణదీవెనగర్, పిప్పల్‌కోటి ఉర్దూ మీడియం, ప్రభుత్వ పాఠశాల భుక్తాపూర్ పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం పీఎంశ్రీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో నాలుగు పాఠశాలలను ప్రీప్రైమరీ కోసం ఎంపిక చేసింది. జైనథ్ మండలంలోని దీపాయిగూడ, సిరికొండ మండల కేంద్రం, భీంపూర్ మండలంలోని నిపాని, గాదిగూడలోని చింతగూడ పాఠశాలల్లో వీటిని ప్రారంభించింది. ఆయా పాఠశాలల్లో ఇందుకోసం ప్రత్యేక తరగతి గది ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆటపాటలతో కూడిన చదువు, స్లీపింగ్ అవర్, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. వీరికి విద్యాబోధన చేసేందుకు ఆయా గ్రామాల్లోనే ఉన్నత చదువు చదివిన వారిని ఎంపిక చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8వేలు, ఆయాకు రూ.6వేలు చెల్లిస్తున్నారు. మూడేళ్లు పైబడిన పిల్లలను ఎల్‌కేజీ, నాలుగేళ్లు పైబడిన వారిని యూకేజీలో చేర్పుతున్నారు. వీటి నిర్వహణ నిమిత్తం గ్రీన్‌బోర్డులు, ఫ్యాన్లు, ఇతర వాటి కోసం రూ.30వేలు, బోధన సామగ్రి, ఆట వస్తువుల కోసం మరో రూ.30వేలు విడుదల చేసింది.

సర్కారు బడుల బలోపేతం కోసం..

సర్కారు బడుల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభిస్తుంది. ఇక్కడ ఎల్‌కేజీ, యూకేజీ చదివిన పిల్లలు వచ్చే విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో చేరేందుకు అర్హత ఉంటుంది. తద్వారా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు పిల్లలకు ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుంది. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించనున్నారు. అవసరమైన ఫర్నిచర్, ఆట వస్తువులు, బోధన సామగ్రి, భద్రత ప్రమాణాలు, విద్యార్థులను ఆకర్షించేలా గోడలపై రంగు రంగుల బొమ్మలు, పిల్లలు నిద్రపోయే గదిని ఏర్పాటు చేయనున్నారు. పారిశుధ్య పనులను గ్రామపంచాయతీతో చేపట్టనున్నారు.

15 పాఠశాలల్లో అమలు..



జిల్లాలోని 15 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ) అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం కింద ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభమైంది. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన బోధన అందించడం జరుగుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా టీచర్, ఆయాలను తాత్కాలిక పద్ధతిన నియమించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో సర్కారు బడులు మరింత బలోపేతం అవుతాయి.

– రఘురమణ, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి


గంగయ్య (ఫైల్‌)

నిర్మల్‌: మండలంలోని టెంబుర్ని గ్రామంలో విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై గణేశ్‌ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కోసారి గంగయ్య (46) కిరాణాషాపు నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం షాపు తెరిచి క్లీన్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు రిఫ్రిజిరేటర్‌ వైర్‌కు చేయి తగిలి కరెంట్‌ ప్రవహించడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు 108లో నిర్మల్‌ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్‌ పరిశీలించగా అప్పటికే గంగయ్య మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తపాలా భవనాల మరమ్మతుకు నిధులు


తపాలాశాఖ పురాతన భవనం

పాతమంచిర్యాల: తపాలాశాఖ భవనాల మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇండియా పోస్ట్‌ పేమెంట్స్‌ బ్యాంకు, పాస్‌పోర్టు కార్యాలయం, మంచిర్యాల బజార్‌ బ్రాంచి పోస్టాఫీస్‌, రైల్వే మెయిల్‌ సర్వీస్‌ కార్యాలయం తపాలాశాఖకు చెందిన పురాతన భవనంలో కొనసాగుతున్నాయి. కాగా, కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పై కప్పునుంచి నీరు చేరుతుంది. అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించడంతో రూ.11 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరమ్మతు చేపట్టనున్నారు.

క్షేత్రస్థాయిలో పాటుపడితేనే పార్టీ బలోపేతం


పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

నిర్మల్‌ఖిల్లా: క్షేత్రస్థాయిలో పాటుపడితేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని జిల్లా అధ్యక్షుడు రితేశ్‌ రాథోడ్‌, రాష్ట్ర సంఘటన్‌ మంత్రి చంద్రశేఖర్‌ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'బీజేపీ ప్రశిక్షణ అభియాన్‌'కార్యక్రమంలో డివిజన్‌, మండలాధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాతీయవాద సిద్ధాంతాలను కలిగిన దేశం కోసం, సైద్ధాంతిక సాధికారత కోసం పాటుపడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన ప్రణాళికలను వివరించారు. ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్‌, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్‌, ముథోల్‌, ఆర్మూర్‌, నిజామాబాద్‌ అర్బన్‌, సిర్పూర్‌ ఎమ్మెల్యేలు పాయల్‌ శంకర్‌, రామారావుపటేల్‌, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు, ప్రేమేందర్‌రెడ్డి, కార్యక్రమ ఇన్‌చార్జి రావుల రామ్‌నాథ్‌, వండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకే చాన్స్‌



కాగజ్‌నగర్‌ నవోదయ విద్యాలయం

- నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ముగియనున్న దరఖాస్తుల గడువు
- ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు 2,660

కాగజ్‌నగర్‌టౌన్‌: ఉమ్మడి జిల్లాలోని కాగజ్‌నగర్‌ జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు మంగళవారంతో గడువు ముగియనుంది. 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రూరల్‌ ప్రాంత విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయించారు. 3, 4, 5 తరగతులు రూరల్‌ ప్రాంతాల్లో చదివి ఉండాలి. వయస్సు 2014 మే 1 నుంచి 2016 జులై 31 వరకు జన్మించి ఉండాలి. నవోదయలో ఆరో తరగతిలో ఖాళీగా ఉన్న 80 సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌ ద్వారా గతనెల 1 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇప్పటివరకు 2,660 దరఖాస్తులు రాగా, ఇందులో అత్యధికంగా భైంసాలో 479, అత్యల్పంగా మందమర్రిలో 49 వచ్చాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఆదిలాబాద్‌ 306, బోథ్‌ 218, నిర్మల్‌ 334, భైంసా 479, ఖానాపూర్‌ 106, లక్సెట్టిపేట 195, మంచిర్యాల 256, చెన్నూర్‌ 97, మందమర్రి 49, బెల్లంపల్లి 100, ఆసిఫాబాద్‌ 175, కాగజ్‌నగర్‌ 103, సిర్పూరు(టి)107, ఉట్నూరు 135 దరఖాస్తులు వచ్చాయి. కాగా, 2024–25 సంవత్సరానికి 4,200, 2025–26 సంవత్సరానికి 5,047 ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు వచ్చాయి.

ప్రయోజనాలు

నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఉచితంగా విద్య అందిస్తారు. మెరుగైన విద్యాబోధనతోపాటు వసతి సౌకర్యం, నాణ్యమైన భోజనం, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం అన్ని ఉచితంగా కల్పిస్తారు. విద్యార్థులకు వేర్వేరుగా వసతి, భోజన సౌకర్యం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నవోదయలో 6వ తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో 2,660 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నాం. ఎంఈవోలు, డీఈవోలకు కరపత్రాలు అందజేశాం. రేపటితో గడువు ముగియనుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్‌, కాగజ్‌నగర్‌

సేవ్‌ ఆదివాసీ పేరుపై ఉద్యమం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సోయం బాపూరావు

- రాజ్‌గోండ్‌ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు

ఆదిలాబాద్‌రూరల్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆదివాసీలపై దాడులు చేయడంతోపాటు అటవీ ప్రాంతం నుంచి దూరం చేసేందుకు కుట్రలను తిప్పికొట్టేందుకు సేవ్‌ ఆదివాసీ పేరుపై జాతీయస్థాయిలో ఉద్యమం చేపడుతానని రాజ్‌గోండ్‌ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపూరావ్‌ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఆదివారం ఆయన రాజ్‌గోండ్‌ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి ఆదివాసీలు తరలివచ్చారు. ముందుగా జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్‌లో భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా ఎస్టీయూ భవనానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ఏం చేశారని తనను జిల్లాలోని కొందరు ప్రశ్నించడంతోపాటు లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తనకు ఎమ్మెల్యే టికెట్‌ ఇవ్వకపోయినా ఫర్వాలేదని ఆసిఫాబాద్‌ నుంచి ఆత్రం సక్కుకు టికెట్‌ ఇవ్వాలని అధిష్టానాన్ని ఒప్పించానని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను బీజేపీలో ఉన్నప్పటికీ ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జు పటేల్‌కు ఓటేయాలని ఆదివాసీలకు పిలుపునిచ్చానని తెలిపారు. చిల్లరవ్యక్తుల మాదిరిగా తాను కాదనే విషయాన్ని గ్రహించాలన్నారు. కేంద్రప్రభుత్వం జీవో నం.49ను రద్దు చేసేవరకు పోరాడతానన్నారు. పార్లమెంట్‌ సమావేశాలు ముగిసే వరకు ఢిల్లీలో టెంట్‌ వేసుకుని ధర్నా చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆదివాసీల సమస్యలను ఇటీవల సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఆదివాసీలు ఏకతాటిపై ఉండాలి
– ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌

లంబాడాలు, గిరిజనేతరులకు దూరమయ్యామని, ఇప్పటికైనా ఆదివాసీలంతా ఏకతాటిపై ఉండాలని ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరిగిన రాజ్‌గోండ్‌ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణాస్వీకారానికి హాజరై మాట్లాడారు. ఆదివాసీల్లో 9 తెగలు విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఆదివాసీ ప్రజాప్రతినిధులు వారి సమస్యల పరిష్కారం కోసం, వాస్తవాలు మాట్లాడితే వారిపై విమర్శలు చేస్తున్నారన్నారు. నాయకులు అర్కు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆత్రం సుగుణక్క, సుధాకర్‌, ఆనంద్‌రావ్‌, రాంకిషన్‌, తానాజీ, డీసీసీబీ చైర్మన్‌ భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్‌ నర్సయ్య, శ్రీనివాసరెడ్డి, గజేందర్‌, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ

ఆదిలాబాద్‌రూరల్‌: జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించే రాష్ట్ర గిరిజన సలహా సంఘం సమావేశం సందర్భంగా ఆదివాసీలకు సంబంధించి కీలక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ తరఫున గిరిజన ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ విడుదల చేసినట్లు రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గోడం గణేశ్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15 ముఖ్య అంశాల్లో జీవో 49 రద్దు చేయాలని, ఎల్టీఆర్‌ కేసుల పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి ఐఏఎస్‌ స్థాయి అధికారిని నియమించాలని తెలిపారు. ఐటీడీఏ పీవో అధికారాల బలోపేతం చేయాలని, జీవో నం.3కు చట్టబద్ధత కల్పించాలని, 31 శాఖల సమన్వయంతో ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. జీవో 2 రద్దు చేసి పదోన్నతుల్లో గిరిజనులకు న్యాయం చేయాలని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పథకాన్ని గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మళ్లీ ప్రారంభించాలని కోరారు.

ఆగస్టు 23, 24న హెచ్‌ఎంఎస్‌ కేంద్ర మహాసభలు



మాట్లాడుతున్న రియాజ్‌ అహ్మద్‌

శ్రీరాంపూర్‌: సింగరేణి మైనర్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌(హెచ్‌ఎంఎస్‌) 3వ కేంద్ర మహాసభలు ఆగస్టు 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌ అహ్మద్‌ తెలిపారు. ఆదివారం నస్పూర్‌ కాలనీలోని శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నస్పూర్‌ కాలనీలోని మనోరంజన్‌ సముదాయం వద్ద ఈ మహాసభలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి రోజు కార్యవర్గ సమావేశం, రెండోరోజు ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. 150 మంది ప్రతినిధులు, 600 మంది సభ్యులు, వెయ్యి మంది కార్యకర్తలు ఈ సభలకు తరలిరానున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలు, సింగరేణి పరిరక్షణపై ఇందులో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సింగరేణిలో కార్మికులు తమ సమస్యల కోసం పోరాడి, ప్రశించకుండా గెలిచిన ఏఐటీయూసీ,ఐఎన్టీయూసీ సంఘాల నేతల భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కంపెనీ వ్యాప్తంగా సర్వీస్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సింగరేణిలో కొత్త గనులు రావాలన్నారు.

యూనియన్‌ బలోపేతానికి కృషి

అనంతరం నూతనంగా ఎన్నికైన యూనియన్‌ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ బెల్లంపల్లి రీజియన్‌లో యూనియన్‌ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. యూనియన్‌ బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి, నాయకులు గొల్ల సత్యనారాయణ, దుర్గం లక్ష్మణ్‌ పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీఆర్టీ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్‌: మండల కేంద్రంలోని కుమురం భీమ్‌ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన సీఆర్టీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ బాలురు ఆశ్రమ పాఠశాల, బీఎడ్‌. పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమురం భీమ్‌ కాంప్లెక్స్‌లో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు 2,651 మందికిగాను 2,509 మంది అభ్యర్థులు హాజరుకాగా, 142 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 94.64 శాతం హాజరు నమోదైందని తెలిపారు. సబ్‌ కలెక్టర్‌ యువరాజ్‌ మార్మాట్‌ పలు కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. డీడీ అంబాజీ, స్క్వాడ్లు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్‌ బందోబస్తు నిర్వహించారు.

- జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడి


బానోతు ప్రసాద్‌, ఏడీఏ, చెన్నూర్‌

చెన్నూర్‌రూరల్‌: పంటల పెరుగుదలకు సూక్ష్మపోషకాల ఆవశ్యకత ఎంతో అవరమని చెన్నూర్‌ ఏడీఏ బానోతు ప్రసాద్‌ తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్‌ అందుబాటులో ఉన్న సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే పంటల దిగుబడి తగ్గుతాయి. జింక్‌, ఇనుము, బోరాన్‌, రాగి, మాంగనీస్‌, మాలిబ్డినం, క్లోరిన్‌ వంటివి సూక్ష్మ పోషకాలు అంటారు. నేలలో ఏ ఒక్క సూక్ష్మ పోషక పదార్థం లోపం ఉన్నా సరైన ఫలితం ఇవ్వదు. నేలలోనే వాటికి సంబంధించిన ఎరువులను వేసుకుని పంట లోపాలు నివారించుకోవాలని సూచించారు.

జింక్‌: మొక్కల పెరుగుదలకు అవసరమైన నత్రజని, భాస్వరం వంటి పోషకాలు సమర్థ వినియోగానికి జింక్‌ చాలా అవసరం ఉంటుంది.

లోపం: మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనె పారిపోతుంది. నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో ముదురాకు చివర్లలో మధ్య ఈనెకు ఇరుపక్కలా తుప్పు లేదా ఇటుక రంగుమచ్చలు కనిపిస్తాయి. ఇవి మిగతా ఆకు అంతటా వ్యాపిస్తుంది. ఆకులు గిడసబారి దుబ్బు చేయవు. నత్రజని, ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చగా ఉండదు.

వరిలో సూక్ష్మ పోషకాలు అవసరం


వరి పైరు

నివారణ చర్యలు: వరి పండించే భూముల్లో ప్రతిమూడు సార్లు ఒక సారి, రబీ సీజన్‌లో రెండు పంటలు పండించే భూములు, ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్‌ సల్ఫేట్‌ వేయాలి. భాస్వరం ఎరువుతో జింక్‌సల్ఫేట్‌ కలిపి వేయరాదు. కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. జింక్‌ సల్ఫేట్‌ వేయలేని పరిస్థితుల్లో పైరుపై జింక్‌ లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్‌ సల్ఫేట్‌ కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారి చేయాలి.

ఇనుము: ఆకుల్లో పత్రహరితం తయారు కావడానికి ఇనుము ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. అధిక క్షార భూముల్లో, సున్నపు పాలు ఎక్కువ గల నేలలు, తేలిక నేలల్లో, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న నేలల్లో ఇనుము లోపాలు కనిపిస్తాయి. మెట్ట వరి, మెట్ట నారుమళ్లలో ఇనుము లోపం కనిపిస్తుంది.

లోపం: లేత చిగురాకులు తెల్లగా మారుతాయి. లోపం ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు ఏర్పడి, ఆకులు ఎండిపోతాయి. పీకలు తగ్గి ఎత్తు పెరగదు.

నివారణ చర్యలు: ఒక లీటర్‌ నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలి. ఇక మిగతా సూక్ష్మపోషకాలు తక్కువ మోతాదులో అవసరమవుతాయి. మార్కెట్‌లో అన్ని సూక్ష్మపోషకాల మిశ్రమం ఆగ్రోమిన్‌మాక్స్‌ రూపంలో ఫార్ములా–4 రూపంలో లభ్యమవుతాయి. సూక్ష్మపోషకాల అవసరాన్ని బట్టి పైరులో వీటిని తగిన సమయంలో వాడి అధిక దిగుబడి పొందవచ్చు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


గౌళ మారుతి (ఫైల్‌)

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన గౌళి మారుతి(39), శోభాబాయి దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు. కూలీ పనిచేసుకునే మారుతి కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ పని చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలను పట్టించుకోలేదు. నాలుగేళ్ల క్రితం తన కూతుళ్లతో కలిసి భార్య పుట్టింటికి వెళ్లి ఇచ్చోడ మండలకేంద్రంలోని అద్దె ఇంట్లో ఉంటోంది. కూలీ పని చేసి పిల్లలను చదివిస్తుంది. కొబ్బయ్‌గూడలో ఒంటరిగా ఉంటున్న మారుతి మద్యం మత్తులో ఆదివారం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నారు. ఉదయం మారుతి పనికి రాకపోవడంతో తోటి కూలీలు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి హెచ్‌బీటీ టీచర్‌..


అశోక్‌ (ఫైల్‌)

బజార్‌హత్నూర్‌: పురుగుల మందు తాగి హెచ్‌బీటీ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సంజయ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొప్పారపు అశోక్‌ (37) బోథ్‌ ఆదర్శ పాఠశాలలో హెచ్‌బీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా అ నారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 15న కడుపునొప్పి భరించలేక ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్‌ రిమ్స్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

భైంసాటౌన్‌: మతిస్థిమితం లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పిప్రి కాలనీకి చెందిన సచివార్‌ భూమేష్‌(40)కు గతంలో రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. ఈక్రమంలో మతిస్థిమితం కోల్పోయాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపినాథ్‌ తెలిపారు.

కడెం ప్రాజెక్టుకు ఆదివారం రాత్రి 2,204 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా.. ప్రస్తుతం 694.625 అడుగుల నీటి మట్టం ఉంది. – కడెం



బాసరలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతోపాటు శ్రావణమాసంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి బారులు దీరారు. చిన్నారులకు తల్లిదండ్రులు అక్షర శ్రీకారపూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

తెలంగాణ క్రికెట్‌ క్యాంప్‌నకు ఎంపిక


రిత్విక్‌

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన రెడ్డి రిత్విక్‌ అనే విద్యార్థి తెలంగాణ క్రికెట్‌ క్యాంప్‌ నకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని ఎమ్మెస్కే ప్ర సాద్‌ ఇంటర్నేషనల్‌ క్రికెట్‌ అకాడమీలో ఇటీవల యూ త్‌ స్టార్స్‌ క్రికెట్‌ లీగ్‌ (వైఎస్‌సీఎల్‌) ఆధ్వర్యంలో సౌత్‌ జోన్‌ క్రికెట్‌ ఎంపిక పోటీలు జరిగాయి. అండర్‌–14 విభాగంలో జరిగిన పోటీల్లో రి త్విక్‌ పాల్గొని సత్తాచాటి ఎంపికయ్యాడు. ఈమేరకు రిత్విక్‌కు మూడేళ్లపాటు స్పాన్సర్‌ షిప్‌ లభిస్తుంది. పలువురు అతన్ని అభినందించారు.

ఎస్సారెస్పీలోకి వరద నీరు

మామడ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 50 వేల క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు 1070.30 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.8 టీఎంసీలకు చేరింది.

ఏజెన్సీ ప్రాంతాల్లో డీఎస్సీ నిర్వహించాలి


మాట్లాడుతున్న సుమేశ్‌

ఉట్నూర్‌రూరల్‌: రాష్ట్రప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీని ప్రకటించాలని సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు జాదవ్‌ సుమేశ్‌, నాయకుడు దీపక్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్రైబల్‌ అడ్వైయిజరీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. జీవో 3 పునరుద్ధరించి, ఏజెన్సీ హక్కుల పరిరక్షణకు కీలకంగా ఉన్న జీవోను ప్రభుత్వం తిరిగి అమలు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 29 శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలన్నారు. 2013లో సర్వశిక్షణ అభియాన్‌ ద్వారా మంజూరైన 569 పోస్టులకు ప్రభుత్వ ఆమోదించి, ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో పద్మశాలీల పాత్ర కీలకం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాపు

భీమారం: దేశ ఆర్థిక వ్యవస్థలో పద్మశాలీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వృత్తిపరంగా విద్యాపరంగా వ్యాపారాల్లో స్ఫూర్తిదాయకంగా ఎదిగారన్నారు. అయితే కీలకమైన రాజకీయ రంగంలో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు. దీంతో పద్మశాలీలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పద్మశాలీలు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ దేవసాని నాగరాజు, వేముల అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

పద్మశాలీ సంఘం భీమారం మండల అధ్యక్షుడిగా గుడిమల్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల నరేశ్‌, కోశాధికారిగా గుడిమల్ల నరహరి, గౌరవ అధ్యక్షుడిగా బండి రాజం, ఉపాధ్యక్షుడిగా బండి శ్రీరాములు, సిరపురం మధుకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శించిన హ్యూమన్‌రైట్స్‌ సభ్యులు


విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం తీసుకుంటున్న సభ్యులు

కోటపల్లి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర సభ్యులు కమలాబాయి, మంచిర్యాల జిల్లా వుమెన్స్‌ వింగ్‌ అధ్యక్షురాలు సరోజ ఆదివారం సందర్శించారు. గతంలో పనిచేసిన హెచ్‌ఎం అశోక్‌ తమతో అసభ్యంగా ప్రవర్తించారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని కోటపల్లి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. భరోసా కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్‌ విమెన్స్‌ వింగ్‌ అధ్యక్షురాలు అంజలి, ఉమ్మడి వరంగల్‌ జిల్లా జనరల్‌ సెక్రెటరీ విజయారెడ్డి, మంచిర్యాల జిల్లా ప్రెసిడెంట్‌ రాజేందర్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ సునీల్‌, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.